RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 20 | డిసెంబర్ 23, 2025 | వెల : రూ.3-00



అక్షయ పాత్ర సేవలు అనిర్వచనీయం 4లో..

# కేసీఆర్ యాక్టివ్..!

## రెండేళ్ల తర్వాత మౌనం వీడిన బీఆర్ఎస్ అధినేత



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి, సుమారు రెండేళ్ల పాటు రాజకీయంగా మౌనంగా ఉన్న బీఆర్ఎస్ అధినేత ఒక్కసారిగా యాక్టివ్ కావడం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త కదలికలకు తెరలేపింది. అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత కేసీఆర్ అడపాదడపా మినహా ఎక్కడా పెద్దగా స్పందించలేదు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కానీ, ప్రభుత్వాన్ని విమర్శించడంలో కానీ పాల్గొనలేదు. కేటీఆర్, హరీశ్ రావు మినగా బీఆర్ఎస్ నుంచి ఎవరూ పెద్దగా స్పందించిన సందర్భాలూ లేవు. ఈ నేపథ్యంలో 'కేసీఆర్ ఏం చేస్తున్నాడంటూ..' తీవ్ర అసంతృప్తితో ఉన్న పార్టీ నేతలకు కేసీఆర్ మళ్లీ యాక్టివ్ కావడంతో రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపింది. పంచాయతీ ఎన్నికల ఫలితాల అనంతరం ఒక్కసారిగా బీఆర్ఎస్ అధినేత రంగంలోకి దిగడం వెనుక గట్టి రాజకీయ వ్యూహాలే ఉన్నాయన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఇది కేవలం భావోద్వేగ ప్రతిస్పందనా? లేక కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందస్తు రాజకీయ యుద్ధానికి ఇచ్చిన సంకేతమా? అన్న ప్రశ్నలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

**– ఇన్నాళ్ల మౌనం వ్యూహమేనా?**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ పూర్తిగా సైలెంట్ కావడం అప్పట్లోనే అనేక అనుమానాలకు దారి తీసింది. ఇలా మౌనంగా ఉంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పూర్తిగా మూలకు పడడం ఖాయం..అన్న హెచ్చరికలు సొంత పార్టీ నేతల నుంచే వచ్చాయి. అయినా కేసీఆర్ స్పందించలేదు. కానీ రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం మాత్రం.. ఓటమి తర్వాత వెంటనే వీధి రాజకీయాల్లోకి దిగితే పార్టీ మరింత బలహీనపడే ప్రమాదం ఉందని, కేడర్‌లోని నిరాశ తగ్గి, కాంగ్రెస్ ప్రభుత్వంపై సహజ అసంతృప్తి పెరిగే వరకు వేచిచూడాలన్నది కేసీఆర్ వ్యూహంగా చెబుతున్నారు.

**– పంచాయతీ ఎన్నికలు బలాన్నిచ్చాయా?**

అలాంటి సమయంలో వచ్చిన పంచాయతీ ఎన్నికల ఫలితాలు కేసీఆర్‌కు రాజకీయంగా ధైర్యాన్నిచ్చినట్లు తెలుస్తోంది. అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ మొత్తం గ్రామాలను క్లీన్ స్వీప్ చేయలేకపోయిందన్న వాస్తవాన్ని కేసీఆర్ గ్రహించారనే చర్చ జరుగుతోంది. ముఖ్యంగా సీఎం స్వయంగా కాంగ్రెస్‌కు సుమారు 66 శాతం సర్పంచ్ స్థానాలు వచ్చాయి..అని చెప్పడం.. బీఆర్ఎస్ అంతర్గత సర్వేలో 40 శాతం సీట్లు తమ పార్టీకి వచ్చినట్లు తేలడం.. కేసీఆర్‌కు కీలక సంకేతంగా మిగతా 3వ పేజీలో..

- ☐ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు దేనికి సంకేతం
- ☐ సమయం కోసమే ఇన్నేళ్లు మౌనం పాటించారా?
- ☐ బలాన్నిచ్చిన పంచాయతీ ఎన్నికలు
- ☐ స్థానిక ఎన్నికలపై కాంగ్రెస్లో అంతర్మథం
- ☐ ఇదే అదునుగా భావించి ప్రభుత్వంపై సీరియస్
- ☐ ఇక రేవంత్ సర్కార్ ను ఇరుకున పెట్టేలా వ్యూహాలు
- ☐ వచ్చే ఎన్నికలకు ఇప్పటినుంచే గ్రౌండ్ వర్క్ అంటున్న విశ్లేషకులు
- ☐ బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ పెంచిన అధినేత మాటలు

## మావోయిస్టుల ఆయుధ కర్మాగారం ధ్వంసం

- సుక్మా అటవీ ప్రాంతంలో గుర్తించిన భద్రతా బలగాలు
- షార్ట్ రైఫిల్, డిటోనేటర్లు, పేలుడు పదార్థాల స్వాధీనం
- మావోలకు మరో భారీ ఎదురుదెబ్బ



**వేద న్యూస్, భువనేశ్వర్:**

ఇప్పటికే ఆపరేషన్ కగార్‌తో తీవ్ర ఒత్తిడిలో ఉన్న మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు నిర్వహిస్తున్న రహస్య ఆయుధ తయారీ కేంద్రాన్ని భద్రతా బలగాలు, పోలీసులు సంయుక్తంగా గుర్తించి పూర్తిగా ధ్వంసం చేశారు. దీంతో అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కుట్రను భద్రతా దళాలు భగ్నం చేశాయి. సుక్మా జిల్లా మీనాగట్టా అటవీ ప్రాంతంలో కేంద్ర భద్రతా బలగాలు, రాష్ట్ర పోలీసులు కలిసి కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా మావోయిస్టులు నిర్వహిస్తున్న ఆయుధ తయారీ కేంద్రం భద్రతా బలగాల కంట పడింది. అక్కడ భారీగా ఆయుధాలు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. కూంబింగ్ సమయంలో సింగిల్ షాట్ రైఫిల్స్, డిటోనేటర్లు, భారీ పేలుడు పదార్థాలు, బాంబుల తయారీకి మిగతా 3వ పేజీలో..

## కులాంతర వివాహం చేసుకుందని..

- కుమార్తెను రాడ్ తో కొట్టి చంపిన తండ్రి
- మృతురాలు ఆరు నెలల గర్భిణీ
- కర్ణాటకలోని హుబ్బళ్లిలో అమానుషం





**వేద న్యూస్, హుబ్బళ్లి:**

కులాంతర వివాహం చేసుకుంద నే కారణంతో గర్భిణీ కుమార్తెను తండ్రే హతమార్చిన అమానుష ఘటన కర్ణాటకలో చోటు చేసుకుం ది. ఆరు నెలల గర్భిణీ అయిన 19 ఏళ్ల మాన్యను ఆమె తండ్రి ఇనుప రాడ్‌తో కొట్టి చంపిన ఘటన సమాజాన్ని కలచివేసింది. ఈ దాడిలో మాన్య అత్తమామలు కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఏడాది మే నెలలో మాన్య తన కుటుంబ సభ్యులు వద్దన్నా లెక్కచేయకుండా కులాంతర వివాహం చేసుకుంది. పెళ్లి తర్వాత కుటుంబం నుంచి ప్రాణహాని ఉందన్న అనుమానంతో కొద్ది నెలలు హావేరి జిల్లాలో దంపతులు నివసించారు. అనంతరం డిసెంబర్ 8న హుబ్బళ్లి జిల్లాలోని సొంత గ్రామానికి తిరిగి వచ్చారు. కులాంతర వివాహంపై ఆగ్రహంతో ఉన్న మాన్య తండ్రి ప్రకాష్, బంధువులు ఆదివారం ఉదయం భర్త, మామపై దాడికి ప్రయత్నించారు. అయితే వారు పొలంలో నుంచి తప్పించుకుని పారిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే ఇదే కక్షతో సాయంత్రం సమయంలో మాన్య అత్తమామల ఇంట్లోకి బలవంతంగా ప్రవేశించారు. గర్భిణీ అయిన మాన్యపై ఆమె తండ్రి ఇనుప రాడ్‌తో దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన అత్తమామలు రేణుకమ్మ, మిగతా 3వ పేజీలో..

## నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం

3లో..

## నకిలీ యాప్‌లతో జాగ్రత్త

- మోసాలు అధికమవుతున్నాయి
- అపరిచిత లింకులు క్లిక్ చేస్తే ఖతమే
- ప్రజలకు తెలంగాణ పోలీసుల హెచ్చరిక

3లో..

# 'డీసీ' రాజ్యమా?

- దేవాదాయ ధర్మదాయ శాఖలో దుమారం
- కారుణ్య నియామకాలలో అక్రమాలపై లేఖ కలకలం
- వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ పై తీవ్ర ఆరోపణలు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

దేవాదాయ ధర్మదాయ శాఖలో వరంగల్ జోన్ పరిధిలో డీసీ అంతా నా ఇష్టం.. నాదే రాజ్యం అనే తీరులో వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సదరు డిప్యూటీ కమిషనర్ పై మహిళా సిబ్బంది పేరుతో రాసిన లేఖ వాట్సాప్‌లో వైరల్ కావడంతో శాఖలో ఉద్రిక్తత నెలకొంది. డీసీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే వరంగల్ జోన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగినులపై వేధింపులు, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని లెటర్‌లో పేర్కొన్నారు. మాజీ డీసీపై ఆరోపణల నేపథ్యంలో ఆయనను బదిలీ చేయగా, ఆయన బ్యాచ్‌మేట్, సన్నిహితురాలిని నూతన డీసీగా నియమించారు.

**– మహిళా సిబ్బందిపైనే కక్ష?**

మాజీ డీసీ బదిలీకి మహిళా సిబ్బందే కారణమన్న అనుమానంతో, వారిపైనే కక్షగట్టి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. నెలకు ఒకరు లేదా ఇద్దరిని తరచూ బదిలీ చేస్తూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని, కొందరిని పలుమార్లు బదిలీ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని లేఖలో వివరించారు. భర్త మృతి అనంతరం కుటుంబ పోషణ కోసం కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగంలోకి వచ్చిన మహిళలను అవమానకరంగా మాట్లాడుతున్నారని, 'ఏమి వస్తది.. ఏమి రాదు' అంటూ హేళన చేస్తున్నారని ఆరోపించారు. బొట్టు, గాజులు, పూలు,




పూజలు వంటి వ్యక్తిగత అంశాలపైనా వ్యాఖ్యలు చేస్తూ మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని లేఖలో వెల్లడించారు. తోటి మహిళా సిబ్బందిపై వివాహేతర సంబంధాలున్నాయంటూ దుష్ప్రచారం చేస్తూ, ఒకరి దగ్గర మరొకరి విషయాలు చెప్పి పరువు నష్టం కలిగిస్తున్నారని, ఒక మహిళగా ఉండి మహిళల మనోభావాలను కూడా పట్టించుకోవడం లేదని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు.

**– ఔట్సోర్సింగ్ సిబ్బంది తొలగింపు**

డీసీ కార్యాలయంలో 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కక్షసాధింపుగా తొలగించారని, వారి స్థానంలో ముగ్గురిని కొత్తగా నియమించుకున్నారని ఆరోపించారు. అందులో ఒకరు మాజీ డీసీ వ్యక్తిగత డ్రైవర్‌గా పనిచేసిన ప్రైవేట్ వ్యక్తి కాగా, మరో వ్యక్తి అన్యమతస్తుడని లేఖలో పేర్కొన్నారు. ఈ నియామకాల కోసం రూ.3 లక్షలు తీసుకున్నారన్న ఆరోపణలు కూడా సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఉన్నతాధికారులు స్పందించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డీసీ నుంచి తమను కాపాడి, మంచి వ్యక్తిత్వం గల అధికారిని నియమించాలని మహిళా సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆరోపణలపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా ఈ లేఖలు అసల్యంగా వెలుగులోకి వచ్చాయి.

# 'ఖాకీ'కి మాయని మచ్చ!









- కొందరు అధికారుల తీరుతో పోలీస్ శాఖ అబాసుపాలు
- ఇల్లీగల్ దందాలను ప్రోత్సహిస్తున్న వైనం
- బెదిరించి తమ దారికి తెచ్చుకునే ప్రయత్నం
- వినకుంటే బెదిరింపులు.. తప్పుడు కేసులు
- చర్యలకు ఉపక్రమించిన ఉన్నతాధికారులు
- తాజాగా ఏసీపీ స్థాయి అధికారి, సీఐ, ఎస్ఐలపై పోలీస్ బాస్ వేటు
- పోలీస్ వ్యవస్థను కుదిపేసిన సస్పెన్షన్ ఉత్తర్వులు

**వేద న్యూస్, ఫోకస్ టీం:**

పోలీస్ వ్యవస్థకు రక్షకులుగా నిలవాల్సిన ఖాకీలే కొన్నిచోట్ల మాయని మచ్చలుగా మారుతున్నాయనే ఆరోపణలు మరోసారి నిజమవుతున్నాయి. తాజాగా ఏసీపీ స్థాయి అధికారి సహా ముగ్గురు పోలీస్ అధికారులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేయడం పోలీస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. క్రమశిక్షణ, న్యాయం, చట్టపాలనకు ప్రతీకగా నిలవాల్సిన వ్యవస్థలోనే అక్రమాలు, వర్గపోరులు, తప్పుడు కేసుల మోత మోగడం ఆందోళన కలిగిస్తోంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేసిన సమయంలో మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు కేసులు నమోదు చేశారన్న ఫిర్యాదులు అధికార యంత్రాంగాన్ని కుదిపేశాయి. ఈ ఆరోపణలపై నిర్వహించిన అంతర్గత విచారణలో కీలక అంశాలు వెలుగులోకి రావడంతో, విచారణాధికారులు సమర్పించిన నివేదిక ఆధారంగా రాష్ట్ర పోలీస్ డీజీపీ శివధర్ రెడ్డి కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉత్తర్వుల మేరకు గతంలో వరంగల్ ఏసీపీగా విధులు నిర్వహించిన నందిరాం నాయక్, ప్రస్తుతం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న గోపి, అలాగే ఎస్ఐ విఠల్ ను సస్పెండ్ చేశారు. తప్పుడు కేసులు బనాయించడం, తమకు అనుకూలంగా ఉన్న వారిని వెనుకేసుకొస్తూ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడం వంటి ఆరోపణలు ఈ ముగ్గురిపైనా ఉన్నట్టు సమాచారం.

**- వారి కనుసన్నల్లోనే దందాలు..**

పోలీస్ విభాగంలో అంతర్గత గ్రూపులను ప్రోత్సహించడం, చెప్పినట్టు వింటే సరే.. లేదంటే రౌడీలతో బెదిరింపులకు పాల్పడటం, రియల్ ఎస్టేట్ దందాలు, భూగాదాల్లో అంతర్గతంగా చేతులు కలపడం వంటి ఆరోపణలు గత కొంతకాలంగా వినిపిస్తూనే ఉన్నాయి. గతంలోనూ పలువురు పోలీస్ అధికారులపై ఇల్లీగల్ అఫైర్స్ ఆరోపణలు వెలుగులోకి రాగా, వాటి దుష్పరిణామంగా సూసైడ్ ఘటనలు చోటుచేసుకున్న సందర్భాలూ ఉన్నాయి.

**- మారని ఖాకీల తీరు..**

క్రమశిక్షణ చర్యలు తీసుకుంటున్నప్పటికీ, కొందరి ఖాకీల తీరు మారడం లేదన్న విమర్శలు పోలీస్ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీస్తున్నాయి. అయితే తాజా సస్పెన్షన్లు మాత్రం తప్పుడు పనులకు పాల్పడితే ఎంతటి అధికార స్థాయిలో ఉన్నా చర్యలు తప్పవు అన్న స్పష్టమైన సంకేతంగా భావిస్తున్నారు. ఈ పరిణామాలు పోలీస్ శాఖలో స్వచ్ఛత, పారదర్శకత, బాధ్యతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. చట్టాన్ని కాపాడాల్సిన చేతులే చట్టాన్ని ఉల్లంఘిస్తే, ప్రజల విశ్వాసం నిలబడదన్న వాస్తవాన్ని గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు తావు లేకుండా వ్యవస్థాపక సంస్కరణలు, కఠిన పర్యవేక్షణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

## యాప్ ద్వారానే రైతులు యూరియాను బుక్ చేసుకోవాలి

**- మండల వ్యవసాయ అధికారి ఋషేంద్రమణి**

**వేద న్యూస్, దామరచర్ల :**



రైతులు మొబైల్ యాప్ ద్వారానే తమకు కావలసిన యూరియాను బుక్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఋషేంద్రమణి తెలిపారు. దామరచర్ల లో రైతులకు యూరియా యాప్ గూర్చి సోమవారం ఆమె అవగాహన కల్పించారు.యూరియా వృధా కాకుండా ఉండేందుకు గాను ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ ను తీసుకొచ్చింది చెప్పారు.రైతులు ముందుగా గూగుల్ ప్లే స్టోర్ నుండి యాప్ ను డోన్ చేసుకోవాలని కోరారు. యజమానులు, రైతులు, పట్టాదారులు, కౌలు రైతులు పట్టాదారు పాస్ బుక్ కు లింక్ అయి ఉన్న మొబైల్ నెంబర్ తో ఓటిపి నమోదు చేయడం ద్వారా మండలంలో అందుబాటులో ఉన్న యూరియా దుకాణాల వివరాలు తెలుపుతుందని, ఎకరాకు మూడు బస్తాల చొప్పున తమ అవసరం మేరకు ఎక్కడ లభిస్తుందో చూసుకొని కొనుగోలు చేయవచ్చునని చెప్పారు.డీలర్లు తమ వివరాలను యాప్ లో నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ పార్వతి , రైతులు వెంకటరెడ్డి ,అంతిరెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి ,వీరకోటి రెడ్డి ,వీరయ్య ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సర్పంచ్ ఇందూరు సునీతకు సన్మానం

**వేద న్యూస్, రుద్రూర్:**



తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్ బీన్ హందన్ రుద్రూర్ గ్రామ సర్పంచ్ గా గెలుపొందిన ఇందూరు సునీత ను సోమవారం శాలువా, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాన్సు వాడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్, బచ్చు రాము, ఉప సర్పంచ్ నిస్సార్, ఇందూర్ కార్తీక్, వడ్ల నరేష్,శ్రీకాంత్ గౌడ్, కర్కే సాయి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## అరవింద పబ్లిక్ స్కూల్లో ఘనంగా మ్యాథ్స్ డే

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్లో విద్యార్థులు జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. గణిత ఉపాధ్యాయురాలు దివ్యశ్రీ నేతృత్వంలో విద్యార్థులు చక్కటి గణిత ఎగ్జిబిట్స్ ను తయారు చేసుకొని వచ్చి ప్రదర్శించి వాటి గురించి వివరించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య ఎగ్జిబిట్స్ ను తిలకించి విద్యార్థులను అభినందించారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నర్సయ్య మాట్లాడుతూ.. ఆధునిక కాలంలో గణితం లేకుండా జీవితాన్ని ఊహించలేమని, గణితం జీవితానికి వెలుగునిచ్చే మార్గమని తెలిపారు. గణితం కేవలం సంఖ్యలు, సూత్రాలు మాత్రమే కాకుండా ఆలోచన శక్తిని, తార్కికతను, సమస్యల పరిష్కారాన్ని చూపుతోందని సూచించారు. అందుకని విద్యార్థులు గణితంలో భయపడకుండా ఆసక్తిగా నేర్చుకుంటే భవిష్యత్తు బంగారు మయమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. అశ్విని, ఏ. నర్మద, అఫ్రీన్, ఏ. సుస్మిత, కె. గౌతమి, ఎం. రమ్య, జి. లీనాశ్రీ, జి. బాలప్రభ, పి. స్రవంతి, కె. కస్తూరి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కనగర్తి సర్పంచ్‌గా రామంచ సంపత్ ప్రమాణం

**- కొలువుదీరిన గ్రామ పాలకవర్గం**

**వేద న్యూస్, ఇల్లందకుంట:**





"రామంచ సంపత్ అనే నేను.. శాసనం ద్వారా ఏర్పాటు చేయబడిన భారత రాజ్యాంగానికి నిజమైన విధేయత కలిగి ఉంటానని.. భారతదేశ సార్వభౌమత్వం, ఏకత్వాన్ని కాపాడుతానని, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018, దాని కింద రూపొందించిన నియమావళి ప్రకారం, నా విధులు, బాధ్యతలను, భయం, పక్షపాతం లేకుండా, నిష్ఠ, నిజాయతీతో నిర్వహిస్తానని ప్రమాణం చేస్తున్నాను." కనగర్తి గ్రామ పంచాయతీ ప్రథమ పౌరుడిగా రామంచ సంపత్ సోమవారం ప్రమాణం చేశారు. కనగర్తి గ్రామ పాలకవర్గం సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.ఈ సందర్భంగా నూతన సర్పంచ్ సంపత్ మాట్లాడుతూ..సర్పంచ్ గా తన గెలుపు తనది కాదని గ్రామ ప్రజలందరిదనీ, కేవలం తనను ముందు ఉంచి మీరంతా దగ్గరుండి గెలిపించుకున్నారని ఆ ఘనత అంతా ఊరి ప్రజలకే దక్కుతుందని మరొక సారి స్పష్టం చేశారు. ఈ చక్కటి అవకాశం ఇచ్చిన గ్రామ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, ప్రజలు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగపరిచి తమ బిడ్డ 'సర్పంచ్‌గా' చాలా చక్కగా పనిచేస్తున్నాడు, ఊరిని బాగు చేస్తున్నాడు, అభివృద్ధి వైపు పయనింప చేస్తున్నాడు అని మీరంతా గర్వపడేలా ఇతర గ్రామాల ప్రజలతో చెప్పుకునే విధంగా పాటుపడతానని సంపత్ వెల్లడించారు.ఊరి కోసం, ఊరి అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా కొత్త సర్పంచ్ పాటు పడతారని ఈ సందర్భంగా జనం ఆకాంక్షించారు.

## సర్పంచ్ గా రేణుక శ్రీనివాస్ ప్రమాణం

**వేద న్యూస్, పెద్ద శంక్రంపేట:**



మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా జంగం రేణుక శ్రీనివాస్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ పంచాయితీ కార్యాలయంలో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని గ్రామ ప్రజల మధ్య ప్రతిజ్ఞ చేశారు. అలాగే ఉప సర్పంచ్ గా ఎర్ర రాజు గౌడ్, వార్డ్ మెంబర్లు పాల్గొని గ్రామ అభివృద్ధికి సహకరిస్తామని ప్రమాణస్వీకారం చేశారు. అనంతనం సర్పంచ్, ఉప సర్పంచ్లు, వార్డ్ మెంబర్లకు శాలువాలతో సన్మానించారు.

## ఘనంగా మ్యాథ్స్ డే వేడుకలు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణి నికేతన్ హైస్కూల్లో గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భారతదేశ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా సోమవారం పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచంలోని గణిత మేధావులలో శ్రీనివాస రామానుజన్ అగ్ర గన్యులు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత ఆకృతులైన రూట్, పై, ఈ క్వాలిటీ, పర్సెంటేజ్, 1729లను ప్రదర్శించారు. విద్యార్థులకు గణిత టాలెంట్ టెస్ట్, క్విజ్, గణిత ప్రాజెక్టుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆ కార్యక్రమంలో కరస్పాండెంట్ తూముకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనిధి, గణిత ఉపాధ్యాయులు రాజు, రమేష్, రాజు, శ్రీనివాస్, సంతోష్, జలజ, రేణుకతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేసీఆర్ యాక్టివ్..! రెండేళ్ల తర్వాత మౌనం వీడిన బీఆర్ఎస్ అధినేత

మారిందన్న వాదనలు ఉన్నాయి. అంటే గ్రామాల్లో కాంగ్రెస్‌పై పూర్తి స్థాయి మద్దతు లేదన్న విషయం ఆయన పసిగట్టారా? అందుకే మళ్లీ యాక్టివ్ అయ్యారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**– గ్రామాల్లో అధికారపార్టీపై వ్యతిరేకతను**

పంచాయతీ ఎన్నికలు సాధారణంగా అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. అలాంటిది కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించ లేకపోవడం, గ్రామస్థాయిలో అసంతృప్తి ఉందన్న సంకేతంగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. సంక్షేమ పథకాల అమలు, హామీల నెరవేర్పు, స్థానిక నాయకత్వంపై అసంతృప్తి.. ఇవన్నీ కలిసి గ్రామాల్లో గాలి మారుతున్నదన్న భావనకు బలం చేకూర్చాయి. ఇదే గాలిని ముందే పసిగట్టిన కేసీఆర్, దాన్ని బీఆర్ఎస్‌కు అనుకూలంగా మలచేందుకు ఇప్పుడే రంగంలోకి దిగారన్నది ఒక వాదన కూడా వినిపిస్తోంది.

**– ఘాటు వ్యాఖ్యలు దేనికి సంకేతం**

ఆదివారం జరిగిన విస్తృతస్థాయి పార్టీ సమావేశంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆయనలోని ఆగ్రహాన్ని స్పష్టంగా చూపించాయి. 'నన్ను తిట్టడమే సీఎం, మంత్రుల పనిగా పెట్టుకున్నారు..' అన్న వ్యాఖ్యలు కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష రాజకీయ దాడిగా మారాయి. ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న కేసీఆర్ ఇప్పుడు మాటల దాడికి దిగడం, ఇకపై రాజకీయ పోరు మరింత తీవ్రంగా ఉంటుందన్న సంకేతంగా భావిస్తున్నారు. పార్టీ సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఇక నేనేంటో చూపిస్తా.. తోలు తీస్తా.. అంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఊపు తెచ్చినట్లయింది. ఇది కేవలం మాటల హెచ్చరిక కాదని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై దాడి మరింత వ్యవస్థబద్ధంగా ఉండబోతుందన్న అంచనాలు బలపడుతున్నాయి. ఇక అన్ని విధాలా రాజకీయ ఒత్తిడి పెంచే వ్యూహాలు సిద్ధమవుతున్నాయన్న ప్రచారం జరుగుతోంది.

**– కాంగ్రెస్‌లో అంతర్మథనం..**

పంచాయతీ ఫలితాల అనంతరం 18 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు స్వయంగా సీఎం క్లాస్ పీకినట్లు వచ్చిన వార్తలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇది కాంగ్రెస్‌లో అంతర్గత అసంతృప్తి ఉందన్న సంకేతమా? లేక భవిష్యత్తులో మరింత సమస్యలు తలెత్తబోతున్నాయన్న ముందస్తు హెచ్చరికనా? అనే చర్చకూడా రాజకీయ వర్గాల్లో జరిగింది. ఈ పరిణామాలను కేసీఆర్ వ్యూహాత్మకంగా వినియోగించుకుని, కాంగ్రెస్‌ను అంతర్మథనంలోకి నెట్టాలన్న కేసీఆర్ వ్యూహం పన్నారని కూడా చర్చ జరుగుతోంది.

**– బీఆర్ఎస్‌కు శ్రేణుల్లో జోష్**

ఇన్నాళ్లూ నిరాశలో ఉన్న బీఆర్ఎస్ శ్రేణుల్లో కేసీఆర్ యాక్టివ్ కావడంతో ఒక్కసారిగా జోష్ పెరిగింది. పార్టీ మళ్లీ లేచింది..అన్న భావన క్యాడర్‌లో బలపడుతోంది. ఇది రాబోయే రోజుల్లో గ్రామస్థాయి నుంచి పార్టీని పునర్వ్యవస్థీకరించేందుకు దోహదపడుతుందన్న అంచనాలు ఉన్నాయి. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, పంచాయతీ ఎన్నికలను సెమీ ఫైనల్‌గా భావిస్తూ కేసీఆర్ వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటినుంచే గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టినట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. గ్రామస్థాయి క్యాడర్‌ను మళ్లీ యాక్టివ్ చేయడం, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడం, ప్రజల్లో అసంతృప్తిని రాజకీయంగా మలచడం.. ఇవన్నీ దీర్ఘకాల వ్యూహంలో భాగమేనని చెబుతున్నారు.

# మావోయిస్టుల ఆయుధ కర్మాగారం ధ్వంసం



ఉపయోగించే సామగ్రిని పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. భద్రతా దళాలనే లక్ష్యంగా తయారు చేసిన పేలుడు పదార్థాలను అక్కడికక్కడే నిర్వీర్యం చేసి పేల్చివేశారు. ఈ చర్యతో ఆ ప్రాంతంలో మావోయిస్టుల దాడి యత్నాలకు గట్టి అడ్డుకట్ట పడింది. 2026 మార్చి చివరినాటికి దేశంలో మావోయిస్టు సమస్యను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతాల్లో కేంద్ర భద్రతా బలగాలు, రాష్ట్ర పోలీసులు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. వరుస ఎన్‌కౌంటర్లలో వందలాది మంది మావోయిస్టులు మృతి చెందగా, మరికొందరిని అరెస్ట్ చేశారు. అలాగే జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాల ఎదుట పలువురు మావోయిస్టులు లొంగిపోవడం గమనార్హం.

# కులాంతర వివాహం చేసుకుందని..





సుభాష్‌లను కూడా దుండగులు దారుణంగ కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసుల ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత ఆసుపత్రికి తరలించారు. మాన్య తంౖ ప్రకాష్‌తో పాటు మరో ఇద్దరు బంధువుల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై ప్రత్యే దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసినట్ల పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మిగత నిందితులను త్వరలో పట్టుకుంటామని స్పష్టం చేశారు. కులం పేరిట జరిగే హింసాత్మక చర్యలపై కఠిన చర్యలు అవసరమని ఈ ఘటన మరోసారి చాటుతోంది

# చాణక్య దళ జిల్లా అధ్యక్షుడి నియామకం

**వేద న్యూస్, కాజీపేట:**




కాజీపేట విష్ణుపురి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో సోమవారం అఖిల భారత బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఇటీవల అఖిల భారత బ్రాహ్మణ సేవా సంఘం చాణక్య దళ హనుమకొండ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన చిలకపాటి వెంకట శివకుమార్ ని మాజీ కార్పొరేటర్లు నార్లగిరి రామలింగం, గుంటి కుమారస్వామి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లిఖార్జున శాస్త్రి సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం మాట్లాడుతూ.. బ్రాహ్మణ సమాజ సేవ, సాంస్కృతిక విలువల పరిరక్షణలో అఖిల భారత బ్రాహ్మణ సేవా సంఘం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. చాణక్య దళ హనుమకొండ జిల్లా అధ్యక్షునిగా నియమితులైన చిలకపాటి వెంకట శివకుమార్ సమాజ ఐక్యతకు, యువతలో సేవాభావం పెంపొందించడంలో ముందుండాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. అలాగే బ్రాహ్మణ సంఘం కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువయ్యేలా కొత్త బాధ్యతలతో శివకుమార్ సమర్థవంతంగా పనిచేస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుంచు కృష్ణ, చిన్నపెదులు, అశోక్, రోమేష్, కొండ శివ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ యాప్‌లతో జాగ్రత్త

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

మొబైల్ ఫోన్ల వినియోగం పెరిగిన నేపథ్యంలో నకిలీ యాప్‌ల ద్వారా మోసాలు అధికమవుతున్నాయని తెలంగాణ పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఆకర్షణీయమైన ప్రకటనలు, తక్షణ రుణాలు, బహుమతులు, ఉద్యోగ అవకాశాల పేరుతో లింకులు పంపి యాప్‌లు డౌన్‌లోడ్ చేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ప్లే స్టోర్ లేదా అధికారిక యాప్ దుకాణాల ద్వారా మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. అపరిచిత లింకులపై క్లిక్ చేసి యాప్‌లు ఇన్‌స్టాల్ చేస్తే, బ్యాంక్ ఖాతాల వివరాలు, వ్యక్తిగత సమాచారం దొంగిలించే ప్రమాదం ఉందని తెలిపారు. యాప్ ఇన్‌స్టాల్ చేసిన వెంటనే అనవసర అనుమతులు కోరితే వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు. ప్రత్యేకంగా రుణాలు, పెట్టుబడులు, లాభాల హామీ ఇచ్చే యాప్‌లు ఎక్కువగా నకిలీవేనని పోలీసులు పేర్కొన్నారు. ఈ యాప్‌లు ఫోన్‌లోకి ప్రవేశించిన తర్వాత లింకులు పంపించడం, సందేశాలు చదవడం, ఫోటోలు పొందడం వంటి చర్యలకు పాల్పడుతున్నాయని తెలిపారు. ఇటువంటి యాప్‌ల వల్ల ఆర్థిక నష్టం జరగడమే కాకుండా గోప్యతకు ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. నకిలీ యాప్‌ల వల్ల మోసానికి గురైన వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలంగాణ పోలీస్ సూచించింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద యాప్‌లు, లింకుల పట్ల జాగ్రత్త వహించాలని కోరింది. డిజిటల్ భద్రతపై అవగాహనతోనే ఇటువంటి మోసాలను అరికట్టవచ్చని పోలీసులు స్పష్టం చేశారు.





# మూగ జీవాలకు నట్టల నివారణ టీకాలు

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో సోమవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేయడం జరిగిందని పశువైద్యాధికారి డా. సంతోష్ కుమార్ తెలిపారు. ఈ శిబిరంలో 158 జీవాలకు టీకాలు వేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నూతన సర్పంచ్ నందిగాం సుమలత, ఉపసర్పంచ్ పట్లోల సురేష్, వార్డు సభ్యులు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం




**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

- ప్రజల ఆరోగ్యం, విద్య, ఉపాధియే ప్రభుత్వ అసలైన ఎజెండా
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- విజయ మెడికల్ సెంటర్ జిల్లా స్థాయి డయాగ్నోస్టిక్ సేవలు ప్రారంభం

ప్రజల ఆరోగ్యం, విద్య, ఉపాధి వంటి మౌలిక అంశాల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ అసలైన ఎజెండా అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం విజయ మెడికల్ సెంటర్ జిల్లా స్థాయి డయాగ్నోస్టిక్ సేవలను వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. తెలంగాణ వ్యాప్తంగా నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. విశ్వసనీయమైన డయాగ్నోస్టిక్ సేవలు ప్రజా ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రెండవ శ్రేణి నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించేలా ప్రోత్సాహం అందించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. ఆధునిక వైద్యం వ్యాధిని తొలిదశలోనే గుర్తించడంపై ఆధారపడి ఉంటుందని, అందుకే ప్రతి పౌరుడికి నాణ్యమైన పరీక్షా సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన న్యూబర్గ్ డయాగ్నోస్టిక్స్, విజయ మెడికల్ సెంటర్ బృందాన్ని భట్టి విక్రమార్క అభినందించారు. ఖచ్చితత్వం, నిష్పక్షపాతత, మానవతా విలువలతో తెలంగాణ ప్రజలకు సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు.

# టెన్త్ విద్యార్థులకు ఘనంగా సత్కారం

**వేద న్యూస్, దామరచర్ల :**




పది వార్షిక పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన పలువురు తమ పాఠశాల విద్యార్థులను శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకలలో ఘనంగా సత్కరించారు. 550 మార్కులతో మండల టాపర్ గా నిలిచిన నకిరేకంటి శివాని కి షీల్డ్ ,ప్రశంసా పత్రం తోపాటు రూ 10 వేల నగదును అందజేశారు. ఆలాగే 500 మార్కులు దాటిన మరో ఐదుగురికి తలా పది వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లిమామేరి, ఉపాధ్యాయులు సత్యనారాయణ ,శ్రీను, బీష్మా రెడ్డి, శేఖర్, కిషన్, దుర్గా, సునీత, సులోచన తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయికి ఎదిగేలా శ్రమించాలి

- సాఫ్ట్ బాల్ క్రీడాకారుల సంఖ్య పెరుగుతుంది
- హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి

**వేద న్యూస్, హన్మకొండ:**



జాతీయ స్థాయికి ఎదిగేలా క్రీడా శిక్షణ పొందాలని సాఫ్ట్ బాల్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి కోరారు. హనుమకొండలోని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన సాఫ్ట్బాల్ సబ్ జూనియర్ బాల, బాలికల ఎంపిక కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నానాటికి సాఫ్ట్ బాల్ క్రీడాకారుల సంఖ్య పెరుగుతుందన్నారు. చాలా పాఠశాలల్లో విద్యార్థులు సాఫ్ట్బాల్ క్రీడను ఆడటానికి ఉత్సాహం ప్రదర్శిస్తుండడం శుభపరిణామం అన్నారు. అంతకుముందు సాఫ్ట్ బాల్ ఆసోసియేషన్ హనుమకొండ జిల్లా సెక్రటరీ తాబేటి రాజేందర్ మాట్లాడుతూ.. జిల్లాస్థాయిలో పాల్గొన్న క్రీడాకారుల ప్రతిభ ఆధారంగా రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 24, 25వ తేదీల్లో మెదక్ జిల్లాలో మనోహరాబాద్ క్రీడా ప్రాంగణంలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో బాలికల జట్టు పాల్గొననుందని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోచ్ వినయ్, ఫిజికల్ డైరెక్టర్లు సుమలత, సృజన, మధు, ఉపాధ్యాయులు బిక్షపతి, పలువురు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ గ్రామ నూతన సర్పంచ్ గా ఇందూరు సునీత, ఉప సర్పంచ్ గా షేక్ నిస్సార్ సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు 16 మంది వార్డు సభ్యులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరి స్తామని, రుద్రూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామం గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, గ్రామస్థులు, నాయకులు పాల్గొని నూతన ప్రతినిధులు పాల్గొన్నారు.

వేద న్యూస్
మంగళవారం డిసెంబర్ 23, 2025

# 23 ఏండ్లకే సర్పంచ్

- 157 ఓట్ల మెజారిటీ
- కోర్కల్ గ్రామ ప్రజల తీర్పు ప్రత్యేకం
- గ్రామ అభివృద్ధియే ధ్యేయం - సర్పంచ్ పూదరి రమ్యకృష్ణ



**వేద న్యూస్, హుజూరాబాద్ ప్రతినిధి:**



ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే శిరోధార్యం. ఎంతటి నాయకులనైనా పడగొట్టాలన్నా.. మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలన్నా జనమే అది నిర్ణయిస్తారు. సర్పంచ్ ఎన్నికల్లో వీణవంక మండల పరిధిలోని కోర్కల్ గ్రామ ప్రజలు ప్రత్యేకమే కాదు వినూత్నమైన తీర్పునిచ్చారు. బరిలో పది మంది సర్పంచ్ అభ్యర్థులున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల తరఫున కంటెస్ట్ చేస్తున్న వారు ఉన్నా కానీ స్వతంత్ర అభ్యర్థి వైపు మొగ్గు చూపారు. 23 ఏండ్ల పూదరి రమ్యకృష్ణ అనిల్‌ను తమ సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. దీంతో మండలంలోనే అతి చిన్న వయసు గల సర్పంచ్‌గా ఆమె పాపులర్ అయిపోయారు.

**సేవే ధ్యేయం**

సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో అభ్యర్థుల ప్రచారాలను హోరెత్తించారు. ప్రధాన రాజకీయ పార్టీలకు కొంత ఆదాయ వనరులు బలంగా ఉన్నాయి. అయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి.. ప్రజాప్రతినిధులుగా అప్పటికే పని చేసిన వారితో పోటీ పడి మరి.. 23 ఏండ్లకే గ్రామ ప్రథమ పౌరురాలిగా ప్రజాశీర్వాదంతో రమ్యకృష్ణ గెలుపొందారు. కోర్కల్ గ్రామంలో 10 వార్డులుండగా, 1,400 ఓట్లు ఉన్నాయి. 1,229 ఓట్లు పోలింగ్‌లో నమోదు కాగా, 157 ఓట్ల మెజారిటీతో పూదరి రమ్యకృష్ణ అనిల్ సర్పంచ్‌గా గెలుపొందారు.

**సొంతూరికి సేవ**

తను పుట్టి పెరిగిన సేవకు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తామని కోర్కల్ గ్రామ సర్పంచ్ పూదరి రమ్యకృష్ణ అనిల్ తెలుపుతున్నారు. సర్పంచ్ ఎన్నికల సందర్భంలో తమకు గ్రామ వాస్తవ్యులు, సేవావాది కర్రా హరిన్‌రెడ్డి సహకారం నిండుగా, మెండుగా ఉందని వెల్లడించారు. హరిన్‌రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టారు. లక్ష్మీ నర్సింహాస్వామి కోర్కల్ ఆలయ కమిటీ చైర్మన్‌గా ఉన్న హరిన్‌రెడ్డి గ్రామంలో విద్య, వైద్యం విషయమై సాయం చేస్తున్నారు. దురదృష్టవశాత్తు ఆ ఊరిలో ఎవరైనా కుటుంబంలో ఒకరు చనిపోతే ఆర్థిక సాయం నిమిత్తం రూ.5 వేలు ఇచ్చారని చెప్పారు. గ్రామంలోని దేవాలయాలకు రూ.లక్ష చొప్పున ఇచ్చారు. సొంతూరికి సేవ చేసి తనను పెంచిన పెద్దచేసిన సమాజానికి తిరిగిచ్చేయాలనే సదుద్దేశంతో కర్ర హరిన్‌రెడ్డి కోర్కల్ గ్రామానికి విచ్చేయగా, ఆయన సహకారం, ప్రోత్స హం, నిండు మనసుతో ఇచ్చిన ఆశీర్వాద బలంతో తాము సర్పంచ్‌గా గెలిచామని రమ్యకృష్ణ అనిల్ వినమ్రంగా చెబుతు న్నారు. తమను ఆదరించి.. ఆశీర్వదించి.. సర్పంచ్‌గా గెలిపించిన ప్రజలకు చక్కటి సేవలందించి..ప్రజాక్షేత్రంలో నిత్యం ప్రజల కు అందుబాటులో ఉంటామని పూదరి రమ్యకృష్ణ అనిల్ పేర్కొన్నారు.

‘మీ డబ్బు.. మీ హక్కు’ను

# సద్వినియోగం చేసుకోవాలి

- క్లెయిమ్ చేసుకోని ఆస్తుల సమస్యలను పరిష్కరించుకోండి
- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

మీ డబ్బు.. మీ హక్కు కార్యక్రమాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల కోసం మీ డబ్బు.. మీ హక్కు ప్రత్యేక కార్యక్రమాన్ని ఆర్బీఐ ఆదేశాల మేరకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా మీ డబ్బు, మీ హక్కు అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల సమస్యను పరిష్కరించేందుకు కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. బ్యాంకు పొదుపులు, షేర్లు, డివిడెండ్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమా తదితరాలను క్లెయిమ్ చేసుకునేందుకు వీలు కల్పించాలన్న లక్ష్యంతో దీనిని చేపట్టారని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, బంధువులు, సమీప ప్రజలకు తెలియజేయాలని సూచించారు. క్లెయిమ్ చేసుకోని ఆర్థికపరమైన ఆస్తుల వాస్తవ యజమానులు వాటిని పొందేందుకు.. బ్యాంకు శాఖ, భీమా సంస్థ, మ్యూచువల్ ఫండ్ సంస్థ, శిబిరంలోని స్టాక్ బ్రోకరేజీ సంస్థ, ఆన్‌లైన్ ద్వారా స్టాక్ బ్రోకర్‌లలో దేనినైనా సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ వివరాలు అందించి డబ్బులు పొందాలని పిలుపు ఇచ్చారు. కచ్చితంగా నామినీ వివరాలను ఆర్థికపరమైన లావాదేవీల్లో పెట్టాలని, అడ్రస్ మారితే బ్యాంక్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. బ్యాంకుల్లో 10 సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేసుకోని డిపాజిట్ల వివరాలు ఆర్‌బీఐ ఉద్గమ్ వెబ్‌సైట్ (https://udgam.rbi.org.in) ద్వారా పొందొచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఆర్బీఐ ఏజీఎం యశ్వంత్ సాయి, యూబీఐ లీడ్ బ్యాంక్ ఏజీఎం రాధాకృష్ణ, ఎస్బీఐ ఏజీఎం వెంకటేష్, ఎల్ఐ సీ ఏఏఓ వరలక్ష్మి, ప్రోగ్రామ్ కన్వీనర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి పాటుపడాలి


- ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా పనిచేయాలి
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**వేద న్యూస్, శాయంపేట:**



గ్రామీణ అభివృద్ధే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. సోమవారం శాయంపేట మండలం లో ఎమ్మెల్యే పర్యటించారు. శాయంపేట, పత్తిపాక, జోగంపల్లి, పెద్దకోడెపాక గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ,గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్, పాలకవర్గం సభ్యులచే ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల ఆశయాలను నెరవేర్చే విధంగా పాలకవర్గం నిత్యం పని చేయాలని సూచించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్య రంగాల్లో ప్రజా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పారదర్శకతతో పాలన సాగించాలని నూతన సర్పంచ్‌కు, పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా కృషి చేయాలని కోరారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సన్మానం చేశారు.

# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

- పోలీస్ సేవలు ప్రజలకు చేరువ చేయాలి
- రాజన్న జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.

ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 23 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందని పేర్కొన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని చెప్పారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# ఎలుపేట్ సర్పంచ్ గా మాధవి నరసింహ రెడ్డి ప్రమాణ స్వీకరణ

**వేద న్యూస్, టేక్మాల్:**




మెదక్ జిల్లా టేక్మాల్ మండల్ ఎలుపేట్ సర్పంచ్ అభ్యర్థి గా మాధవి నరసింహ రెడ్డితో స్పెషల్ ఆఫీసర్, పంచాయితీ కార్యదర్శి మహేష్ కుమార్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని గ్రామ ప్రజల మధ్య నూతన సర్పంచ్ ప్రతిజ్ఞ చేశారు. అలాగే ఉప సర్పంచ్ గా కుమ్మరి లక్ష్మయ్య, వార్డ్ మెంబర్లు కే, కమలాకర్, కోటగిరి లక్ష్మి, నత్తి అశోక్, పెద్ద దర్శనం బాల మల్లయ్య, కమ్మరి జనార్దన్, గంగోల లచ్చుమ్మ, ఎస్.కె బేగంజాన్, జక్కుల పోచయ్య, పోతురాజు జ్యోతి, పాల్గొని గ్రామ అభివృద్ధికి సహకరిస్తామని ప్రమాణస్వీకారం చేశారు. అనంతనం సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లకు శాలువాలతో సన్మానించినారు.

# నూతన రోడ్డును నిర్మించాలి

- ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేత

**వేద న్యూస్, శాయంపేట:**



పెద్దకోడపాక గ్రామం నుంచి పరకాల హైవే లలిత రెస్టారెంట్ వరకు నూతన రోడ్డును నిర్మించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ సోమవారం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. గత నాలుగు ఐదు సంవత్సరాల నుండి రోడ్డు మొత్తం గుంతల మయమై వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వర్షాకాలం అయితే రైతులు పంట పొలాల కు వెళ్లే క్రమంలో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత నాలుగైదు సంవత్సరాల నుంచి ఎన్నో ప్రమాదాలు ఈ రోడ్డు మార్గంలో జరిగాయని, ఇంత జరుగుతున్నా ప్రజా ప్రతినిధులు అధికారులు ఎవరు కూడా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా తమరు ఈ విషయంపై స్పందించి వెంటనే నూతన రోడ్డును నిర్మించాలని కోరారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మంద మధు, మంద అశోక్, మంద రాజ్ కుమార్, సందీప్ పవన్ కుమార్, అరుణ్ రాజ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ పై అధిక భారం

- డిప్యూటీ తహసీల్దార్ పోస్ట్ ఖాళీతో ఇబ్బందులు

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల తహసీల్దార్ కార్యాలయంలో మూడు నెలలుగా డిప్యూటీ ఎమ్మార్వో పోస్టింగ్ ఖాళీగా ఉండటంతో ఎమ్మార్వోపై పని భారం తీవ్రంగా పెరిగింది. గతంలో డిప్యూటీ ఎమ్మార్వోగా పని చేసిన సత్యనారాయణ పదవీకాలం పూర్తవ్వడంతో ఆ పోస్టింగ్ ఖాళీ అయింది. అయితే ఆ స్థానాన్ని భర్తీ చేయడంలో ప్రభుత్వం మూడు నెలలుగా జాప్యం చేస్తూ పోస్టింగ్‌ను పెండింగ్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. డిప్యూటీ ఎమ్మార్వో లేకపోవడంతో భూమి సంబంధిత దరఖాస్తులు, ధృవీకరణ పత్రాలు, ప్రజావినతులు, పరిపాలనా పనులన్నీ ఎమ్మార్వో ఒక్కడే నిర్వహించాల్సి వస్తోంది. దీనివల్ల కార్యాలయ పనులు ఆలస్యమవుతూ, ప్రజలు పదేపదే కార్యాలయానికి రావాల్సిన పరిస్థితి నెలకొంది. తక్షణమే డిప్యూటీ ఎమ్మార్వోను నియమించి ఎమ్మార్వోపై ఉన్న అధిక పనిభారాన్ని తగ్గించి, ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# అక్షయ పాత్ర సేవలు అనిర్వచనీయం

- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



పేద విద్యార్థుల ఆకలి తీరుస్తున్న అక్షయ పాత్ర సేవలు అనిర్వచనీయం అని రాష్ట్ర దేవాదాయ అటవి పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. నగర పరిధిలోని 14వ డివిజన్ ఎనుమాముల ప్రాంతంలో ఇస్కాన్ అక్షయ పాత్ర ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమం (సిఎస్ఆర్) లో భాగం గా హెచ్ డిబి సహకారంతో అధునాతనం గా ఏర్పాటు చేసిన వంటశాల యంత్రాలను సోమవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇస్కాన్ సేవా సంస్థ వారు ఎనుమాముల ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన కిచెన్ యంత్రాల ప్రారంభోత్సవానికి ఆహ్వానించడం జరిగిందని,ప్రపంచ వ్యాప్తం గా ఇస్కాన్ అంటే తెలియని వారు ఉండరని అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రతిష్ఠలు పొందిన ఆధ్యాత్మిక సామాజిక సేవా సంస్థ అని కృష్ణ చైతన్యాన్ని విశ్వ వ్యాప్తం చేయడానికి ఏర్పడిందని అన్నారు. అనేక విద్యా సంస్థలను సంస్థ నడుపుతుందని హరే కృష్ణ సంకీర్తన ఉచిత ప్రసాద వితరణ ఎంతో ప్రసిద్ధి చెందినదని తెలుగు రాష్ట్రాల్లో వీరు నిర్మించిన ఆలయాలు ఎంతో ప్రతిష్ట పొందాయని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద మధ్యాహ్న భోజన పథకాన్ని నడుపుతున్న అతిపెద్ద సంస్థ ఇదేనని అన్నారు. కేంద్రీకృతంగా ఏర్పాటు చేయబడిన వంటశాలలో వండడం ద్వారా లక్షలాదిమంది పిల్లలకు భోజనాన్ని అందిస్తున్నారని, గంటలో 40 వేల చపాతీలను తయారు చేసే యంత్ర సామాగ్రి వీరి వద్ద ఉందని అన్నారు. భారతదేశంలో 16 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలలో ఉన్న 22 వేల ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు ప్రతిరోజు 20 లక్షల పైచిలుకు విద్యార్థులకు ఆహారాన్ని అందిస్తున్నారని తెలిపారు. భారత ప్రభుత్వం ఆయా రాష్ట్రాల సహకారంతో నడుస్తున్నాయని, ఒక సంఘటన లో వీధి కుక్కలు పిల్లలు ఆహారం కోసం కోట్లాడుకోవడం చూసి చలించిపోయి ఈ సంస్థకు అంకురార్పణ చేయడం జరిగిందని అన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా అవసరార్థులకు ఆహారాన్ని అందించడంతోపాటు కృష్ణ భక్తిని పిల్లలలో నింపడానికి సంకల్పించడం వారి దార్శనికత కు నిదర్శనం అని హరే రామ హరే కృష్ణ అంటే తెలియని వారు ఉండరని అన్నారు. చాలామంది విదేశీయులు ఇక్కడికి వచ్చి సేవలు అందిస్తారని, ఈ ప్రాంతంలో కిచెన్ యంత్ర సామాగ్రి ఏర్పాటు కు సహకారం అందించిన హెచ్ డి బి యాజమాన్యాన్ని ఈ సందర్భం గా మంత్రి అభినందించారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ వారు హైదరాబాద్ లో కిచెన్ ఏర్పాటు కు స్థలం అడిగిన నేపథ్యంలో 2 ఎకరాలు కేటాయించడం జరిగిందని ఇలాంటి మంచి కార్యక్రమాల కోసం ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని, ఇట్టి ఏర్పాటు కు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక శాసన సభ్యులు, మేయర్ కు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం డిసెంబర్ 23, 2025

# రేగోడ్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



- స్టేషన్ పరిసరాలు, రికార్డుల పరిశీలన
- పోలీస్ సిబ్బంది సమస్యలపై ఆరా

**వేద న్యూస్, రేగోడ్:**

మెదక్ జిల్లా రేగోడ్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరు, నిర్వహణ విధానాలను ఎస్పీ పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించేలా అధికారులు, సిబ్బంది వ్యవహరించాలని సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం.. పెండింగ్‌లో ఉన్న తీవ్రమైన నేరాల సీడీ ఫైల్స్, స్థిరాస్తి చోరీ కేసులు, వాటి ప్రస్తుత స్థితిగతులపై రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో తిరిగే అనుమానితులపై పూర్తి సమాచారాన్ని సేకరించాలని, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు భద్రతాభావం కలిగించేలా విసిబుల్ పోలీసింగ్, నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, బ్లూ కోల్ట్స్, పెట్రో కార్లు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డయల్ 100 కాల్స్ వచ్చిన వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కల్పించాలని అన్నారు. సీసీ కెమెరాల పనితీరుపై ఎస్ఐను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పోలీస్ సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే ప్రతి శు క్రవారం తన దృష్టికి తీసుకురావచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బంది పిల్లల చదువుల గురించి తెలుసుకొని, ఉన్నత విద్యను అభ్యసిస్తున్న వారి పిల్లలను అభినందించారు. ఈ కార్యక్రమంలో అల్లాదుర్గ్ సీఐ రేణుక రెడ్డి, డీసీర్బీ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఎస్ఐ పోచయ్యతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నియోజకవర్గములో కాంగ్రెస్ రెండవ స్థానం

- బీఆర్ఎస్ అభ్యర్థులే అధికంగా గెలిచారు.
- గెలిచిన వారు గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి కోసం నూతనంగా ఎన్నికైన సర్పంచ్లు అభివృద్ధి, సంక్షేమం కోసం జోడెద్దుల్లా పని చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డితో కలిసి నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. మానకొండూర్ నియోజకవర్గములో బీఆర్ఎస్ బలపర్చిన 72 మంది అభ్యర్థులు సర్పంచ్ లుగా ఎన్నికయ్యారని అన్నారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు అధిక స్థానాల్లో విజయం సాధిస్తారని పేర్కొన్నారు. మానకొండూర్ నియోజకవర్గములో కాంగ్రెస్ రెండవ స్థానంలో ఉందన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సొంత గ్రామం పచ్చునూర్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి 5వ స్థానంలో నిలిచాడని అన్నారు. క్యాంపు కార్యాలయం ఉన్న మహాత్మనగర్ లో కూడా కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి ఓటమి చెందాడని అన్నారు. గ్రామాల్లో సర్పంచ్ లు ప్రజలకు అందుబాటులో ఉండి కష్ట, సుఖాల్లో పెద్దన్న పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఏ ఊరు వెళ్లినా జననేత రసమయికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆడబిడ్డలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ రవిందర్ రెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ వేణురావు, కంటం రాములు, సిద్ధం శ్రీనివాస్, బిల్లవేని పర్శరాం, సీనియర్ నాయకులు కేవీఎన్ రెడ్డి, ఆరే కొమురయ్య, దేవేందర్ రెడ్డి, ర్యాగటి రమేష్, బుర్ర స్వామి, తదితరులు పాల్గొన్నారు.



# ఓగుల పూజ అనే నేను..

- కాట్నపల్లి సర్పంచ్‌గా ప్రమాణం
- కొలువుదీరిన గ్రామ నూతన పాలకవర్గ

**వేద న్యూస్, సుల్తానాబాద్:**

"ఓగుల పూజ రాజేందర్ అనే నేను.. శాసనం ద్వారా ఏర్పాటు చేయబడిన భారత రాజ్యాంగానికి నిజమైన విధేయత కలిగి ఉంటానని.. భారతదేశ సార్వభౌమత్వం, ఏకత్వాన్ని కాపాడుతానని, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018, దాని కింద రూపొందించిన నియమావళి ప్రకారం, నా విధులు, బాధ్యతలను, భయం, పక్షపాతం లేకుండా, నిష్ఠ, నిజాయతీతో నిర్వహిస్తానని ప్రమాణం చేస్తున్నాను." అని కాట్నపల్లి గ్రామ పంచాయతీ ప్రథమ పౌరురాలిగా ఓగుల పూజ రాజేందర్ సోమవారం ప్రమాణం చేశారు. గ్రామ పంచాయతీ నూతన పాలకవర్గ సభ్యులూ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. నూతన సర్పంచ్, పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ ఓగుల పూజ రాజేందర్ మాట్లాడుతూ.. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ చక్కటి సేవలు అందిస్తామని చెప్పారు. తమకు అండగా నిలిచి ఆశీర్వదించిన ప్రజలకు సేవలందించడమే తమ ధ్యేయమని తెలిపారు. గ్రామాన్ని సుల్తానాబాద్ మండల పరిధిలో అగ్రగామిగా తీర్చే లక్ష్యంతో పని చేస్తామని వెల్లడించారు.





## సిరిసేడు నూతన పాలకవర్గం ప్రమాణం



**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండలం సిరిసేడు లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు సోమవారం పంచాయతీ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేశారు. ఇల్లందకుంట ఎంపీడీఓ రాజేశ్వరరావు హాజరై వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. సర్పంచ్ రేనుకుంట్ల శ్యామల కుమార్ మాట్లాడుతూ.. వార్డు సభ్యుల సహకారంతో గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం, పాఠశాలలు,ఆరోగ్య సేవల మెరుగుదల కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రమాణ స్వీకార అనంతరం గ్రామ పెద్దలు, నాయకులు నూతన ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపసర్పంచ్ నాగపూరి వంశీ, వార్డు సభ్యులు , గ్రామ అభివృద్ధి అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాటిగూడ సర్పంచ్‌గా వెంకటేష్ బాధ్యతల స్వీకరణ




**వేద న్యూస్, తాటిగూడ:**

తాటిగూడ గ్రామ సర్పంచ్‌గా మడావి వెంకటేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి, అమూల్యమైన ఓటుతో గెలిపించిన ప్రతి గ్రామస్తుడికి జీవితాంతం రుణపడి ఉంటానని పేర్కొన్నారు. సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఈ పవిత్ర క్షణంలో గ్రామ సేవకే తన జీవితాన్ని అంకితం చేస్తానని మడావి వెంకటేష్ అన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తన మొదటి కర్తవ్యమని స్పష్టం చేశారు.గ్రామాభివృద్ధే లక్ష్యంగా రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, స్వచ్ఛమైన తాగునీరు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సర్పంచ్ గా కిషన్ నాయక్ ప్రమాణ స్వీకారం

**వేద న్యూస్ పాపన్నపేట:**



మెదక్ జిల్లా పాపన్నపేట మండల్ అంబ్రియ తండా సర్పంచ్ గా లునవత్ కిషన్ నాయక్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. గ్రామ ప్రజల మధ్య ప్రతిజ్ఞ చేశారు. అలాగే ఉప సర్పంచ్ గా ఖోలా కంసి, వార్డ్ మెంబర్ లు కామల్లీ, వస్య, జగ్య, బధ్య, సురేఖ, దశరథ్, షాను పంచాయతీ కార్యదర్శి వెంకట్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లను శాలువాలతో సన్మానించినారు.

## ఉడుగుల కట్టయ్య గౌడ్ కు నివాళులు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**



వరంగల్ జిల్లా చెన్నారావు పేట మండలం, ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ఊడుగుల కట్టయ్యకు ఉప్పరపల్లి విద్యా, ఉద్యోగ, వ్యాపార, వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. కట్టయ్య దశ దిన కర్మ కార్యక్రమం ను సోమవారం వారి స్వగృహంలో నిర్వహించగా ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కట్టయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కట్టయ్య కుమారులు ఉడుగుల ఐలయ్య,రమేష్, శ్రీను,రాజు లను పరామర్శించారు. ఈ సందర్భంగా పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ కట్టయ్య తన కుటుంబం కోసం ఎంతో శ్రమించి పిల్లలను పెద్ద చేశారని, కుమారుల సేవలు సమాజానికి అవసరమని, మీరు చేస్తున్న సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో బోయిని శ్రీనివాస్,సంగెం శంకర్,రాజు, బుడుగుల రమేష్, సాంబయ్య, కట్టయ్య, రాజు,తదితరులతో పాటు కుటుంబ సభ్యులు బంధువులు పాల్గొన్నారు.

## నూతన గ్రామ పాలకవర్గానికి సన్మానం

**వేద న్యూస్, నల్లబెల్లి :**



నల్లబెల్లి మండలం, నాగరాజుపల్లి గ్రామ నూతన పాలకవర్గానికి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సత్కారం చేశారు. స్థానిక పాఠశాల హెడ్మాస్టర్ కర్ణకంటి రాంమూర్తి, సహోపాధ్యాయులు కూనమల్ల రాజన్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఏపిసి చైర్మన్ ఎరుకల వెంకటలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ కార్యక్రమంలో నాగరాజుపల్లి గ్రామ సర్పంచ్ ఎరుకల లలిత, ఉప సర్పంచ్ బైరి శోభన, వార్డు సభ్యులు చిట్యాల కల్పన, కదురు మోహన్, ఊరటి సునిత, పబ్బు రాజేష్, ఊట్కూరి కృష్ణ, ముత్యాల సునిత, నూనావత్ రమేష్ లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్ణ కంటి రామ్మూర్తి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు అభినందనలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఉండి గ్రామాభివృద్ధికి అందరు కట్టుబడి ఉండాలన్నారు. పార్టీల వైషమ్యాలను చూపకుండా గ్రామం కోసం పాటుపడిన వారిని చరిత్ర గుర్తిస్తుందని పేర్కొన్నారు. అలాగే గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేర్పించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో నాగరాజు పల్లి పంచాయతీ కార్యదర్శి రాకం విష్ణు, నాగరాజుపల్లి, ఒల్లెనర్సయ్యపల్లి అంగన్వాడీ టీచర్లు ఆవునూరి సుజాత, చిట్యాల కవిత, గ్రామపెద్దలు చిట్యాల ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## పాతర్లపల్లి నూతన పాలకవర్గం ప్రమాణం

**వేద న్యూస్, ఇల్లందకుంట:**



పాతర్లపల్లి నూతన పాలకవర్గ సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. నూతన సర్పంచ్‌గా బైరెడ్డి వెంకటరమణారెడ్డి, ఉప సర్పంచ్ చల్లూరి కుమార్, వార్డ్ మెంబెర్స్ ప్రమాణం చేశారు. సర్పంచ్ బైరెడ్డి వెంకట రమణారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పాతర్లపల్లి గ్రామానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎంపీ నిధుల నుంచి, కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి గ్రామ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కాంశెట్టి శ్రీకాంత్, ఆకుల రాజేందర్, అబ్బిడి తిరుపతిరెడ్డి, బైరెడ్డి అమ్మిరెడ్డి, కోడం నవీన్, రోహిణి, శ్రవణ్, మొగిలి, రేణుక, అఖిల, ఈశ్వరమ్మ,సురేందర్ రెడ్డి, బీమ్ రెడ్డి, సమ్మిరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ డిజి స్కూల్‌లో ఘనంగా మాథ్స్ డే

**వేద న్యూస్, కరీంనగర్:**




శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎస్ఆర్ డిజి స్కూల్‌లో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, అబాకస్ 2.0 వ్యవస్థాప కులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు అయిన అడ్డగట్ల గంగాధర్ ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. విద్యార్థు లు తయారుచేసిన వివిధ ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఎదుగుదలకు గణితం చాలా ఉపయోగపడుతుందని ప్రత్యేక అతిథులు అన్నారు. సమాజంపై గణితానికి గొప్ప ప్రభావం ఉందని, ప్రతి విద్యార్థి అభివృద్ధికి గణితం చాలా అవసరమని ఎస్.ఆర్ స్కూల్స్ జోనల్ ఇన్‌ఛార్జ్ శశిధర్ వివరించారు. విద్యార్థుల మానసిక శ్రేయస్సు మరియు పురోగతికి గణితం చాలా అవసరం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం డిసెంబర్ 23, 2025

# పెద్దంపల్లి గ్రామ పాలకవర్గం ప్రమాణం

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట మండల పరిధిలోని పెద్దంపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ తో పాటు వార్డు సభ్యులు సోమవారం పంచాయతీ ఆవరణలో స్పెషల్ ఆఫీసర్ డి శివకుమార్ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. గ్రామ సర్పంచ్ ఎగిత పద్మ ,ఉపసర్పంచ్ దొడ్డే నాగరాజు, వార్డు సభ్యులు నూతనంగా ఎన్నికైన పాలకవర్గంతో స్పెషల్ ఆఫీసర్ శివకుమార్, గ్రామ కార్యదర్శి ప్రదీప్ లు కలిసి నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో సోమవారం రోజున ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎగిత పద్మ, ఉపసర్పంచ్ దొడ్డే నాగరాజు మాట్లాడుతూ.. వార్డు సభ్యుల సహకారంతో గ్రామ అభివృద్ధి ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. గ్రామ ప్రజలందరూ తమపై నమ్మకంతో గ్రామ సర్పంచ్ గా ఎన్నుకున్నందుకు వారికి అన్నివేళలా అందుబాటులో ఉండి ఏ కష్టం వచ్చినా మీకు తోడుగా ఉంటూ మన గ్రామాన్ని మండలంలోనే ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారం పాఠశాలలో ఆరోగ్య సేవలో మెరుగుదల కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రమాణ స్వీకార అనంతరం గ్రామ పెద్దలు నాయకులు నూతన ప్రజా ప్రతినిధులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ డి శివకుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ఉపసర్పంచ్ దొడ్డే నాగరాజు, వార్డు సభ్యులు, గ్రామ అభివృద్ధి అధికారులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

**- ఓరియంట్ సిమెంట్ యూనియన్ అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్**

**వేద న్యూస్, కాసిపేట:**



మండలంలోని దేవాపూర్ కోమటిచెను కొండాపూర్ గ్రామాలలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. దేవాపూర్ గ్రామంలో సర్పంచ్ సిడం రాందాస్, కోమటిచేను గ్రామంలో సర్పంచ్, జాడి మాణిక్య, కొండాపూర్ గ్రామంలో సర్పంచ్, ఒళ్ళేపు శైలజ గ్రామాల్లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో ఓరియంట్ (ఆదాని) సిమెంట్ యూనియన్ అధ్యక్షుడు కొక్కిరాల సత్య పాల్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి కోసం నూతన ప్రజాప్రతినిధులు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వేముల కృష్ణ, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

# దాట్ల వీరస్వామి అనే నేను..

**- కొండపాక సర్పంచ్‌గా ప్రమాణం**
**- కొలువుదీరిన గ్రామ నూతన పాలకవర్గం**



**వేద న్యూస్, వీణవంక:**

"దాట్ల వీరస్వామి అనే నేను.. శాసనం ద్వారా ఏర్పాటు చేయబడిన భారత రాజ్యాంగానికి నిజమైన విధేయత కలిగి ఉంటానని.. భారతదేశ సౌర్వభౌమత్వం, ఏకత్వాన్ని కాపాడుతానని, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018, దాని కింద రూపొందించిన నియమావళి ప్రకారం, నా విధులు, బాధ్యతలను, భయం, పక్షపాతం లేకుండా, నిష్ఠ, నిజాయతీతో నిర్వహిస్తానని ప్రమాణం చేస్తున్నాను." అని వీణవంక మండల పరిధిలోని కొండపాక గ్రామ పంచాయతీ ప్రథమ పౌరుడిగా వీరస్వామి దాట్ల సోమవారం ప్రమాణం చేశారు. కొండపాక గ్రామ నూతన పాలకవర్గ సభ్యులు గ్రామ పంచాయతీ ఆఫీసులో ప్రమాణస్వీకారం చేశారు. నూతన సర్పంచ్‌గా దాట్ల వీరస్వామి, ఉపసర్పంచ్‌గా పూరెల్ల కుమార్, వార్డ్ మెంబెర్స్ ప్రమాణం చేశారు. సర్పంచ్ వీరస్వామి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సమగ్ర అభివృద్ధియే ధ్యేయంగా పని చేస్తామని చెప్పారు. వార్డు సభ్యులు, గ్రామ ప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ పాలకవర్గ సభ్యులకు గ్రామస్తులు, నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# తెలంగాణను వణికిస్తున్న చలి

**హైదరాబాద్ వేద న్యూస్ :**



తెలంగాణ రాష్ట్రాన్ని తీవ్రమైన చలిగాలులు వణికిస్తున్నాయి. సోమవారం పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 5 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లెలో 6.9 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డైంది. మొత్తం 33 జిల్లాల్లో 17 జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే దిగువకు చేరాయి. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో 7 డిగ్రీలు, ఆదిలాబాద్ జిల్లా అర్లిలో 8.3, వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్‌లో 8.7, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో 9.5, కామారెడ్డిలో 9.7 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. హైదరాబాద్ నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో రాత్రి వేళ చలి తీవ్రత మరింత పెరిగింది. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంది. ఈ నేపథ్యంలో భారత వాతావరణ శాఖ ఏడు జిల్లాలకు కోల్డ్ వేవ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. ఈ ప్రాంతాల్లో డిసెంబర్ 26 వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 5 నుంచి 10 డిగ్రీల మధ్య ఉండే అవకాశం ఉందని వెల్లడించింది. మరోవైపు హైదరాబాద్, హనుమకొండ, కరీంనగర్, వరంగల్‌తో పాటు మరో 15 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇక్కడ ఉష్ణోగ్రతలు 11 నుంచి 15 డిగ్రీల మధ్య ఉండొచ్చని అంచనా వేసింది. రానున్న 24 గంటల్లో హైదరాబాద్‌లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం వేళ పొగమంచు ఏర్పడే అవకాశం ఉందని, గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 28, 13 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ బులెటిన్‌లో పేర్కొంది.

# దేవాపూర్ ఆశ్రమ పాఠశాలలో రామానుజన్ జయంతి వేడుకలు

**వేద న్యూస్, కాసిపేట:**





గణితశాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని దేవాపూర్‌లోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు)లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు రొడ్డ గోపాల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాసిపేట మండల విద్యాధికారి వెంకటేశ్వరరావు రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు నిర్వహించిన గణితశాస్త్ర మేళాను పరిశీలించి, విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గణితశాస్త్ర మూలాలను విద్యార్థులకు వివరించారు. గణితంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని, ఇలాంటి మేళాలు విద్యార్థుల మేధస్సు వికాసానికి దోహదపడతాయని తెలిపారు. గణితశాస్త్ర మేళా నిర్వహణపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు

# వెంకట స్వామికి ఘన నివాళులు

**- ఘనంగా వర్ధంతి వేడుకలు**

**వేద న్యూస్, కాసిపేట:**



దివంగత కాంగ్రెస్ పార్టీ జాతీయ అగ్రనాయకులు, మాజీ కేంద్ర కార్మిక, గ్రామీణాభివృద్ధి, జౌళిశాఖ మంత్రి, తెలంగాణ ఉద్యమనేత, కార్మిక హక్కుల కోసం పోరాడిన మహనీయుడు జి. వెంకట స్వామి (కాకా) 11వ వర్ధంతిని మందమర్రి ఏరియా కాసిపేట - 1 ఇంక్లైన్ గనిలో కార్మికులు ఘనంగా నిర్వహించారు. బన్న లక్ష్మన్ దాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అన్ని కార్మిక సంఘాల నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల పరిరక్షణలో కాకా ముందుండేవారని, సింగరేణి సంస్థను కాపాడడంలో ఆయన పాత్ర కీలకమని అన్నారు. బన్న లక్ష్మన్ దాస్ మాట్లాడుతూ పెన్షన్ విధానం ద్వారా పదవీ విరమణ చేసిన కార్మికులకు భరోసా కల్పించిన గొప్ప నాయకుడు కాకా అని కొనియాడారు. అదేవిధంగా కాసిపేట గ్రామ పంచాయతీలో సర్పంచ్ నీల రాంచందర్ ఆధ్వర్యంలో కాకా వెంకట స్వామి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాపర్తి శ్రీనివాస్, బన్న లక్ష్మన్ దాస్ మాట్లాడుతూ కాసిపేట అభివృద్ధికి కాకా చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొని పేదల పెన్నిధి కాకాకు ఘన నివాళులర్పించారు.

# కొలువుదీరిన కొత్త పాలకవర్గం

**- కమలాపూర్ సర్పంచ్ గా సతీష్, ఉప సర్పంచ్ గా పుల్ల శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం**

**వేద న్యూస్, కమలాపూర్:**



హనుమకొండ జిల్లా కమలా పూర్ మేజర్ గ్రామపంచాయతీ కొత్త పాలకవర్గం సోమవారం పదవి బాధ్యతలు చేపట్టింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు నూతనం గా ఎన్నిక కాబడ్డ సర్పంచ్, ఉప సర్పంచ్, 16 మంది వార్డ్ మెంబర్లను ప్రతిజ్ఞ చేయించి పదవి బాధ్యతలు అప్పజెప్పారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. కమలా పూర్ మేజర్ గ్రామపంచాయతీకి మున్సిపాలిటీ అయ్యే అర్హత కూడా ఉందని జనాభా విషయం లో, తదితర అన్ని విషయాలలో మున్సిపాలిటీకి అవసరమయ్యే అంశాలు అన్నీ కమలాపూర్ కలిగి ఉందని, కావున సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు అందరూ కలిసికట్టుగా రాజకీయాలకు అతీతంగా పనిచేయాలన్నారు. ఎన్నికల వరకే రాజకీయ పార్టీలని ఆ తర్వాత గెలిచిన ప్రతి ఒక్కరు గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయాలి తప్ప పక్షపాత ధోరణి ప్రదర్శించకూడదని హితవు పలికారు. గెలిపించి న ప్రజలు గొప్పగా గర్వపడేలా తమ తమ పనితనాన్ని చూపించాలని గ్రామ అభివృద్ధి విషయంలో జిల్లాలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో కూడా ప్రథమ స్థానంలో కమలాపూర్ మేజర్ గ్రామపంచాయతీని తీర్చిదిద్ది ప్రతి గ్రామానికి ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా ఎంపీడీ వో ఆకాంక్షించారు. అనంతరం పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్లు అందరినీ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆ తదుపరి గ్రామ సర్పంచ్ అయిన పబ్బు సతీష్ మాట్లాడుతూ.. సర్పంచ్ గా తన గెలుపు తనది కాదని గ్రామ ప్రజలందరిదనీ కేవలం తనను ముందు ఉంచి మీరంతా దగ్గరుండి గెలిపించుకున్నారని ఆ ఘనత అంతా ఊరి ప్రజలకే దక్కుతుందని మరొకసారి స్పష్టం చేశారు. కొత్తగా ఎన్నికైన వార్డ్ మెంబర్లు మహిళలు అందరికీ కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ శాలువా కప్పి మెడలో దండ వేసి సత్కరించారు. ఈ పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గెలిచిన అభ్యర్థుల కుటుంబ సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఐపీఎస్ అధికారి అమ్మిరెడ్డికి శాసనమండలి నోటీసులు

**- మంత్రి నారా లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యల ఆరోపణ**


**అమరావతి,వేద న్యూస్ :**



ఐపీఎస్ అధికారి అమ్మిరెడ్డికి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సోమవారం హక్కుల నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర సమాచార సాంకేతిక, విద్యాశాఖ మంత్రి లినారా లోకేశ్‌లిను కించపరిచేలా సామాజిక మాధ్యమంలో వ్యాఖ్యలు చేసినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు మండలి వర్గాలు వెల్లడించాయి. గతంలో అమ్మిరెడ్డి గుంటూరు అర్బన్ ఎస్పీగా విధులు నిర్వర్తించిన సమయంలో ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై అందిన ఫిర్యాదును పరిశీలించిన శాసనమండలి, అంశం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని హక్కుల కమిటీకి నివేదించింది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం సమావేశం కానున్న హక్కుల కమిటీ ముందు హాజరుకావాలని అమ్మిరెడ్డిని ఆదేశించింది. మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు జరిగే సమావేశానికి వచ్చి పూర్తి వివరణ ఇవ్వాలని నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. హక్కుల కమిటీ ముందు అమ్మిరెడ్డి ఇచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని శాసనమండలి వర్గాలు పేర్కొన్నాయి. ఈ వ్యవహారం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# వైసీపీపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర విమర్శలు

**అమరావతి, వేద న్యూస్ :**




**- మంత్రి వంగలపూడి అనిత**

ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వైసీపీపై మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. వైసీపీ పూర్తిగా బాధ్యతారహిత ప్రతిపక్షంగా తయారైందని మండిపడ్డారు. చిన్నపిల్లలతో నినాదాలు రాయిస్తూ ఫ్లెక్సీలు పెట్టించడం దుర్మార్గమైన రాజకీయమని వ్యాఖ్యానించారు. మేక తలలు నరికి రక్తాభిషేకాలు చేయిస్తూ సమాజంలో నేర ప్రవృత్తిని పెంపొందిస్తున్నారని వైసీపీ నేతలను దుయ్యబట్టారు. రౌడీ మూకలను నియంత్రించడం, శాంతిభద్రతలను కాపాడడం పోలీసులకు సవాలుగా మారిందని అన్నారు. ఇలాంటి చర్యలతో రాష్ట్రంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. వైద్య కళాశాలల భాగస్వామ్య విధానంలో ఉన్నవారిని అరెస్ట్ చేస్తామని వైసీపీ అధినేత వైఎస్ జగన్ హెచ్చరించడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అనిత ఎద్దేవా చేశారు. గత ఎన్నికల్లోనే వైసీపీకి ప్రజలు గుణపాఠం చెప్పారని, రానున్న ఎన్నికల్లో కూడా మరోసారి బుద్ధి చెబుతారని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని గంజాయి రహితంగా మార్చే లక్ష్యంతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు హోంమంత్రి తెలిపారు. గంజాయి సాగును పూర్తిగా శూన్యానికి తీసుకొచ్చామని, రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వైసీపీ నాయకులపై తమకు ఎలాంటి కక్ష లేదని, కక్షసాధింపులకు పాల్పడితే వారు రోడ్లపై తిరుగుతారా? అని ప్రశ్నిస్తూ విమర్శలకు తెరదించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073